# మిర్చి ధరల పతనాన్ని నిరసిస్తూ ధర్నా


రెంటచింతలలో ధర్నా

**రెంటచింతల, 28-4-17 :**

మిర్చిపంటకు న్యాయమైన ధర కల్పించాలని; డిమాండ్‌చేస్తూ చంద్రన్న చేయూత పథకం మరో వంచనాత్మక, దగాకోరు చర్య అని పేర్కొంటూ; మిర్చి హైబ్రీడ్ రకానికి 12 వేలు, సాదా రకానికి 8 వేలు కొనుగోలు చేయాలని డిమాండ్‌చేస్తూ 28-4-17 రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రెంటచింతలలో ప్రదర్శనచేసి అనంతరం తహశీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొని నాయకత్వం వహించిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ "ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే తీరా అమ్ముకుందామంటే న్యాయమైన ధరలు లేకుండా చేసి రైతు వెన్ను విరిస్తున్నారని, ధరలను పతనం చేసిన ప్రభుత్వమే చంద్రన్న చేయూత పథకం పేరుతో మరో వంచనాత్మక నాటకానికి తెరలేపారని, పథకం ప్రకటించడంతో నామమాత్రంగా వున్న ధరలు మరింతగా పతన మయ్యాయని ఈ పథకం వలన రైతులకు ఒరిగేదేమీ లేదని అన్నారు.

మిర్చి హైబ్రీడ్ రకం 12 వేలకు, సాదా రకం 8 వేలకు కొనుగోలు చేయాలని, దళారీ వ్యాపారుల దోపిడీని అరికట్టాలని, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులన్నింటికి గిట్టుబాటు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు భాస్కర్; లక్ష్మీనారాయణ, హనుమంతు, శేషమ్మ, అచ్చిరెడ్డి, సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

oooooo